# తెలుగువాళ్ళు

ఉదయం పది గంటలు కావస్తోంది.

చర్చి గేట్ స్టేషన్ చాలా కోలాహలంగా ఉంది. ప్రతి రెండు నిమిషాలకు వేలకు వేల జనాన్ని మోసుకొచ్చే సబర్బన్ ట్రైన్ల నుండి పుట్టలు పుట్టలుగా దిగుతున్నారు ఉద్యోగులు. ఉరుకులు పరుగులుగా ఆఫీసుల వైపు వెళుతున్నారు. కొందరు ఫ్లోరా ఫౌంటన్ వైపు వెళ్తే మరికొందరు నారిమన్ పాయింట్ వైపు వెళుతున్నారు. ఇంకా కొందరు న్యూ మరీన్ లైన్స్ వైపు వెళుతున్నారు.

వైశాఖ మాసం. ఎండ తీవ్రత ఎంతో ఇబ్బంది పెడుతోంది. పదిహేను ఇరవై నిమిషాలు ఎండలో నడిచే బదులు పురపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహింపబడే బి.ఇ.ఎస్.టి. స్పెషల్ బస్సులలో ఆఫీసులకు చేరుతారు కొందరు. కొంతమంది బడా ఆఫీసర్లేమో షేర్-ఎ టాక్సీ పథకం కింద టాక్సీ సేవలు ఉపయోగించుకుంటారు.

విరార్ నుండి వచ్చిన ఒక రైల్లోంచి దిగారు రామారావు, సుబ్బారావు.

రామారావు పని చేసేది కఫ్ పరేడ్‌లో ఉన్న ప్రభుత్వ సంస్థలో. అది చర్చి గేటుకి నాలుగు కి.మీ. దూరంలో ఉంటుంది. అతనుండే వసాయి రోడ్డేమో 52 కి.మీ. దూరంలో ఉంది. అంటే అతను రోజుకి రమారమి నూట ఇరవై కిలోమీటర్ల ప్రయాణం చేస్తాడన్నమాట. పని చేసే గంటలు ఏడే అయినా ప్రయాణంలోనే అయిదారు గంటలు గడిచిపోతాయి. పొద్దున ఎనిమిది గంటలకు బయలుదేరితే మళ్ళీ ఇంటికి చేరేది రాత్రి ఎనిమిది తర్వాతే.

బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ హద్దులో ఒక బెడ్‌రూం ఫ్లాటు అయిదు లక్షల నుండి ఒక కోటి రూపాయల వరకూ ఉంటుంది. ఇక్కడ తల దాచుకునే చోటు దొరకటం కష్టం. కానీ కష్టపడే వాళ్ళుంటే బతుకు తెరువు దొరక్కపోదు. హౌజింగ్ లోను, క్లీన్ లోను, పి.ఎఫ్. లోను, క్రెడిట్ సొసైటీలోను తన సేవింగ్స్ ఖాతా అంతా కలిపి రెండు లక్షలకు ఒక అయిదు వందల చదరపు అడుగుల ఫ్లాటు వసాయి రోడ్డులో తీసుకోగలిగాడు రామారావు. అతన్ని దూరపు బంధువు సుబ్బారావు ఉద్యోగాన్వేషణలో బొంబాయికి వచ్చాడు.

సివిల్ ఇంజనీరింగులో డిగ్రీ చేసి, నాలుగు సంవత్సరాలు కావస్తున్నా అతనికి దీటైన, నిలకడైన ఉద్యోగం దొరకలేదు. ఆంధ్రలో రోడ్లు వేసే కాంట్రాక్టర్ దగ్గర రెండేళ్ళు, సినిమా హాళ్ళు కట్టే వాళ్ళ దగ్గర రెండేళ్ళు పని చేశాడు. వాళ్ళిచ్చే జీతం, కల్పించే వసతులు తన ఆశలకు, ఆశయాలకు అస్సలు అందకపోవడంతో బొంబాయి ప్రయాణం

కట్టాడు. తమ అర్హతలకు, అభిరుచులకు తగ్గ ఉద్యోగం మన దేశంలో దొరకదని, నమ్మేవాళ్ళలో సుబ్బారావు ఒకడు. అందుకే అతను గల్ఫ్ దేశాలకు వెళ్ళే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ ప్రయత్నంలోనే నారిమన్ పాయింట్‌లోని ఒక ఏజెంటు ఆఫీసుకు బయల్దేరాడు.

స్టేషన్‌లోని ఎ.హెచ్. వీలర్స్ స్టాల్‌లో 'ఆంధ్రప్రభ' వారపత్రిక కొని, నారిమన్ పాయింట్, స్టేషన్ బస్ క్యూలో నిల్చున్నాడు సుబ్బారావు.

మన దేశంలోని ఇతర చోట్లలా కాక ఇక్కడి చర్చి గేట్, వి.టి. స్టేషన్ల దగ్గిరి స్పెషల్ బస్సు సర్వీసులు చాలా నయం. క్యూలో ఎంతమందున్నా బస్సు దొరికి, తమ గమ్యం చేరుకోవడానికి పదిహేను, ఇరవై నిమిషాలు కంటే ఎక్కువ సమయం పట్టదు. డబుల్ డెక్కర్ బస్సులు, పొడుగైన మామూలు బస్సులు వస్తూనే ఉంటాయి. ప్రయాణికులను మోసుకెళుతూనే ఉంటాయి. ఇక్కడ క్యూ పద్ధతి బాగానే పాటిస్తారనాలి. ప్రయాణికుల సౌకర్యం కోసం బి.ఇ.ఎస్.టి. పర్యవేక్షకులు అనుక్షణం తత్పరులుగానే ఉంటారు.

బస్సు ఎక్కగానే తన చేతిలోని 'ప్రభ' తెరిచాడు సుబ్బారావు. శ్యాంకుమార్ ఒక ఆఫీసులో కంప్యూటర్ ఇంజనీరుగా పని చేస్తున్నాడు. బస్సెక్కగానే అతని దృష్టి 'ప్రభ' మీదికి పోయింది. ఆంధ్రేతర ప్రాంతంలో తెలుగు పుస్తకం కానీ కనిపిస్తే, తెలుగు మాట కానీ వినిపిస్తే 'మన' అనే భావన కలుగుతుంది. అందుకే శ్యాంకుమార్‌ను 'ప్రభ', అది పట్టుకున్న మనిషి ఆకర్షించారు.

సుబ్బారావు కూర్చున్న వరుసలోనే శ్యాంకుమార్‌కు సీటు దొరికింది. ఇద్దరిమధ్య ప్యాసేజే అడ్డం. సుబ్బారావుని చూడగానే బొంబాయికి కొత్తగా వచ్చిన బాపతని కనిపెట్టాడు శ్యాంకుమార్. పదేళ్లకుపైగా ఇక్కడ ఉండటం వల్ల ఇక్కడి ఆచార వ్యవహారాలు, కట్టుబట్ట తీరు శ్యాంకుమార్‌కు అబ్బాయి. సుబ్బారావు చూపులు, హావభావాలు ఒకరకంగా ఉండి, అతను బొంబాయికి కొత్త అని చెప్పకనే చెబుతున్నాయి.

శ్యాంకుమార్ మనసులో 'ఇతన్ని చూస్తే ఉద్యోగం కోసం ఇక్కడకు వచ్చినట్టున్నాడు. వేసుకున్న బట్టలు అంత ఖరీదైనవేం కాదు. కాళ్లకు సాండిల్స్-బూట్లు కూడా లేవు. ఏ టైపిస్టు పోస్టుకో ఇంటర్వ్యూకు వెళుతున్నట్టున్నాడు. అతన్ని పలకరిస్తే? ఊహు తనెందుకు పలకరించాలి? తనకు అతనితో ఏం అవసరం ఉంది? 'రచన' మాసపత్రిక తీస్తాను. అతను సాటి తెలుగువాడిగా తెలుసుకుని మాట్లాడించాడా సరేసరి, లేదా నాకొచ్చిన నష్టమేమి లేదు.'

తన బ్రీఫ్‌కేస్ లోంచి 'రచన' మాసపత్రిక తీసి చదువుతున్నట్లు నటించసాగాడు శ్యాంకుమార్. అప్పుడప్పుడు పక్కచూపులు చూస్తున్నాడు 'ప్రభ' అతను గమనించాడా గమనించాడా అని తెలుసుకోవడానికి.

శ్యాంకుమార్ అనుకున్నట్లు సుబ్బారావు పోయేది ఇంటర్వ్యూకే కానీ ఇంజనీరు పోస్టుకు."దోహ-కత్తర్' లో ఇంజనీర్లు కావాలని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఆపర్చ్యూనిటీస్

ఓవర్‌సీలోని ప్రకటనకు స్పందించి తన అదృష్టం పరీక్ష చేసుకోవడానికి నారిమన్ పాయింట్‌లోని ఒక ఏజెంట్ ఆఫీసుకు పోతున్నాడు. శ్యాంకుమార్ చేతిలోని 'రచన' చూసి సుబ్బారావు మనసులో ఇతనూ తెలుగువాడులా ఉన్నాడే, చేతిలో రచన అంటే మంచి అభిరుచి ఉన్న వ్యక్తే అయి ఉండాలి. డ్రెస్సు, వాలకం, చేతిలో బ్రీఫ్‌కేసు, అదీ చూస్తే మంచి హోదాగల ఉద్యోగంలో ఉన్నట్లున్నాడు. నాచేతిలో 'ప్రభ' చూసి అతను రచన తీసాడు. ఏం నన్ను పలకరిస్తే ఏం పోయింది? తన హోదాకు భంగం కలుగుతుందనా? వీడితో తనకేం పని అనా? రాష్ట్రం కాని రాష్ట్రంలో మనవాళ్ళు కనిపిస్తే ఎంత ఆనందం! ఎంత సంతోషం! కానీ ఇలాంటి వారితో ఏం లాభం? తనేం ఆయన్ని సాయమడుగుతాడా? తన సొమ్మేం ఇవ్వమంటాడా. ఒక్క పలకరింపు, ఒక చల్లని మాట 'ఏఊరు మీది? బొంబాయికి కొత్తలా ఉన్నారు. ఏమైనా పనిమీద వచ్చారా?' అని అడిగితే అరిగిపోతాడా? పక్కచూపులు చూసేబదులు డైరెక్టుగా మాట్లాడితే ఏంపోయింది? తానూ తెలుగువాడినని తెలియజేయడం కోసం తెలుగు పత్రిక తీసి చదివినట్లు నటిస్తున్నాడు. ఇంతసేపట్లో ఒక్క పేజీ అయినా కదిలిందా? అదంతా షో కాదూ? ఏమైతేనేం అతను కల్పించుకుని మాట్లాడితేనే నేను మాట్లాడేది.

శ్యాంకుమార్ స్వగతం- "నేను తెలుగువాణ్ణని తెలిసిందిగా. అటూ ఇటూ చూస్తున్నట్లు, నన్ను గమనించడం, మళ్ళీ ప్రభలో ముఖం పెట్టడం. నన్ను పలకరిస్తే ఏం పోయింది. మన తెలుగు వాళ్ళకు ఏం లేకున్నా గీర మాత్రం బాగా ఉంటుంది. తానేమో ఇక్కడకు కొత్త. తమ రాష్ట్రం వారితో మాట్లాడితే ఇక్కడి తీరుతెన్నులు, ఇక్కడి ఆచార వ్యవహారాలూ తెలుస్తాయిగా. అయితే లాభమే గానీ, నష్టం కాదుకదా! అతను కల్పించుకుని మాట్లాడితే గైడ్ చేద్దామనుకున్నాను. అతనికా ఉద్దేశం ఉన్నట్లు లేదు. అలాంటప్పుడు అతను పలకరిస్తేనే నేను మాట్లాడేది."

నారిమన్ పాయింట్, ఎన్‌సిపిహెచ్ స్టాపు వచ్చింది. "అట్లాంటా" బిల్డింగ్ ఏదని సుబ్బారావు మరెవరినో అడిగాడు. తెలుసుకుని ఆ వైపు నడవసాగాడు. శ్యాంకుమార్ ఆఫీస్ కూడా ఆ బిల్డింగ్‌లోనే. సుబ్బారావు మరెవరినో అడగడం అతను విన్నా కల్పించుకోలేదు. మెల్లగా తన ఆఫీసు వైపు అడుగులు వేసాడు.

"అట్లాంటా" బిల్డింగులోకి శ్యాంకుమార్, ఆ తరువాత సుబ్బారావు ప్రవేశించారు. లిఫ్టు 'క్యూ'లో ఒకరి వెనక ఒకరు నిలుచున్నారు. సుబ్బారావు అయిదో అంతస్తులోని ఏజెంటు ఆఫీసుకు వెళితే శ్యాంకుమార్ 7వ అంతస్తులోని తన ఆఫీసుకు చేరాడు.

అలా ఇద్దరు తెలుగువాళ్ళు చర్చి గేటు నుంచి నారిమన్ పాయింట్ వరకు ఒకే బస్సులో ప్రయాణం చేశారు. ఇద్దరూ తాము తెలుగువాళ్లం అని తెలుసుకున్నారు. ఒకేతోవలో నడిచి ఒకే బిల్డింగ్‌లోకి వెళ్ళారు. ఒకే లిఫ్టులో ప్రవేశించారు. ఎవరికి పని ఉన్న అంతస్థులో వారు దిగిపోయారు. కానీ ఒకరినొకరు పలకరించుకోలేదు. మాట్లాడలేదు. అలా చేస్తే - వారు తెలుగువాళ్ళు ఎలా అవుతారు. ★